
సంపుటి :02 సంచిక :132 పేజీలు :04 వెల ₹5


అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

సోమవారం 14, జూలై 2025



# ఉజ్జయినీ మహంకాళి రక్ష రక్ష!



సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తొలి బోనం సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో సికింద్రాబాద్ వీధులు మార్మోగిపోయాయి. భక్తిపారవశ్యంతో భక్తులు అమ్మవారి నామస్మరణ చేశారు.



# సండేట్లో సడేమియా..!


## కాటారంలో సండే రోజు రెచ్చిపోతున్న మట్టి తోడేళ్లు

- చెరువులు కొల్లగొట్టి అక్రమ మట్టి తవ్వకాలు
- సండే అర్ధరాత్రుళ్ళే వారి టార్గెట్
- మౌఖికంగా ఆదేశాలు ఇస్తున్నట్లుగా అధికారులపై ఆరోపణలు
- ట్రాక్టర్ ఓనర్ల తో డీలింగ్స్ కుదుర్చుకుంటున్నగా ప్రచారం

02

కాటారం మండలంలో అక్రమ మట్టి తవ్వకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఆదివారాలు, సెలవు దినాలను అదనుగా చేసుకుని "మట్టి తోడేళ్లు" చెరువులను కొల్లగొడుతూ, అర్ధరాత్రి వేళల్లో తమ దందా సాగిస్తున్నారు. అధికారులు మౌఖిక ఆదేశాలతో అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ట్రాక్టర్ల యజమానులతో డీలింగ్‌లు కుదుర్చుకుంటూ, యథేచ్ఛగా సాగుతున్న ఈ అక్రమ తవ్వకాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– అక్షర దర్బార్, కాటారం




# 'జూబ్లీహిల్స్'లో గెలుపెవరిది?

- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, మజ్లీస్ మధ్య పోరు
- ఇప్పటికే నియోజకవర్గంలో సర్వే చేయించిన కాంగ్రెస్
- ముగ్గురి పేర్లను అధిష్ఠానానికి పంపించనున్న పార్టీ పెద్దలు
- సీటును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న పార్టీలు

02

## అసెంబ్లీ స్థానానికి త్వరలో ఉప ఎన్నిక

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఆ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక తప్పనిసరి అయింది. దీంతో రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రానికి సూచనలు పంపి, ఉప ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్ కోసం రంగం సిద్ధం చేస్తోంది. సెప్టెంబర్‌లో షెడ్యూల్ రాబోతోందని, అక్టోబర్‌లో పోలింగ్ ఉండొచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సుమారు 3.90 లక్షల ఓటర్లతో జూబ్లీహిల్స్ పెద్ద నియోజకవర్గంగా నిలుస్తున్నది. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ప్రారంభిస్తారని తెలుస్తోంది. దాదాపు 500 ఈవీఎంలు, 1,500 మంది సిబ్బంది అవసరం ఉండటంతో ఏర్పాట్లన్నీ ఇప్పటికే ముమ్మరం చేశారు. భద్రత కోసం కేంద్ర బలగాలు కూడా రంగంలోకి దిగనున్నాయి. ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. జూబ్లీహిల్స్ స్థానాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తున్నది. అలాగే స్థానికంగా మజ్లిస్ పార్టీ ప్రభావం కూడా ఉంది. సిట్టింగ్ సీటును మళ్లీ ఎన్నికల్లో గెలిపించుకునేందుకు బీఆర్ఎస్ కూడా పావులు కదుపుతున్నది. మజ్లిస్ పార్టీ ఒక బలమైన అభ్యర్థిని ప్రకటిస్తే, ముస్లిం ఓట్లు వేరు కావచ్చు.

-అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

# వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్య

## మృతుల్లో ఒకరు వైద్యురాలు

03



# ఆకలి తీర్చే ఆయుధం రేషన్ కార్డు

03

- పేదలు కడుపు నిండా తినాలనే సన్నబియ్యం పంపిణీ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణీ షురూ

# రైతుకు అన్ని విధాలా అండగా ఉంటాం

- ఆర్థిక సమస్యలున్నప్పటికీ సాయం చేస్తూనే ఉంటాం..
- సాగుకు ఇబ్బంది లేకుండా సాగు జలాలు: మంత్రి పొంగులేటి
- ఖమ్మం జిల్లాలోని పాలేరు నుంచి సాగర్ జలాలు విడుదల
- బీఆర్ ఎస్ హయాంలో రైతులకు అన్యాయం: డిప్యూటీ సీఎం భట్టి



03

# సండెట్లో సడేమియా..!

- కాటారంలో సండే రోజు రెచ్చిపోతున్న మట్టి తోడేళ్లు
- చెరువులు కొల్లగొట్టి అక్రమ మట్టి తవ్వకాలు
- సండే అర్థరాత్రుళ్ళే వారి టార్గెట్
- మౌఖికంగా ఆదేశాలు ఇస్తున్నట్లుగా అధికారులపై ఆరోపణలు
- ట్రాక్టర్ ఓనర్ల తో డీలింగ్స్ కుదుర్చుకుంటున్నగా ప్రచారం

అక్షరదర్బార్, కాటారం : అసలే ఆదివారం.. ఊరు, వాడ అందరూ సెలవు దినాన్ని ఎంజాయ్ చేస్తూ హాయిగా నిద్రలోకి జారుకునే సమయమది. ఇక్కడే అసలు కథ మొదలవుతుంది. అర్థరాత్రుళ్ళు సినిమా పాటలు పెట్టుకుని పెద్ద ఎత్తున శబ్దాలతో రయ్ రయ్ మంటూ ట్రాక్టర్లు బయలుదేరుతాయి. ఊరు, వాడ అనే తేడా లేకుండా రోడ్ల పై దర్జాగా వచ్చి ట్రాక్టర్ల తో ఇష్టారాజ్యంగా వ్యవహారిస్తుంటారు. ఇక ఇక్కడ అసలు ట్విస్ట్ ఏంటంటే వాళ్ళేదో దొర కార్యం వెలగబెట్టే పని అసలే కాదు. దర్జాగా చెరువులని చెరబట్టి మట్టి తోడేళ్లుగా అవతారమెత్తి అక్రమ మట్టి దందా చేసే దొంగ కార్యమది.

ఈ తతంగమంతా కాటారం మండలంలో కొనసాగుతుండగా ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ప్రజలు మిన్నకుండిపోతున్న పరిస్థితి.అసలే ఆదివారమైన వేళ సండెట్లో సడేమియాలా.. ఈ సండే సడేమియా ఏంట్రా అంటూ తల పట్టుకోవడం కాటారం మండలం ప్రాంత ప్రజల వంతు అవుతున్నది.కాగా పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం నిద్రమత్తు వీడడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

**సండే రాత్రుళ్ళే వారి టార్గెట్**

కాటారం మండలంలోని కొందరు మట్టి తోడేళ్లు తమ అక్రమ మట్టి దందా కార్యానికి సండే అయితేనే మంచి రోజని ఆ రోజుని ఎంచుకుంటున్నారు. ఆరోజు సెలవు దినం కాబట్టి ఎవరూ పట్టించుకోరనేది మట్టి తోడేళ్ల ధీమా అవుతుండగా అందుకు సంబంధిత అధికారులు సైతం కానివ్వండి మేమున్నామనే మౌఖిక ఆదేశాలు ఇస్తున్నట్లుగా సమాచారం. ఎందుకంటే ఎవరైనా అక్రమ మట్టి దందా పై అధికారులని ప్రశ్నిస్తే తమకు ఆదివారం సెలవు రోజని మేమంతా ఫ్యామిలీ తో ఉన్నామని రేపు వచ్చి చర్యలు తీసుకుంటామని చెప్పకనే చెప్పేలా ఓ మాస్టర్ ప్లాన్ రూపొందించుకుని మట్టి దందాకు పరోక్షంగా సపోర్ట్ చేస్తారని అందరూ చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ మట్టి తోడేళ్లు కాటారం మండలకేంద్రంలోని ఎర్రగుంటపల్లి, అయ్యప్ప టెంపుల్ పరిధి చెరువు, జెన్ కొ పంపు హౌస్ పరిధి చెరువు, గ్యాస్ గోదాం పరిధి చెరువు తో పాటు ఇబ్రహీంపల్లి, మద్దులపల్లి, గంగారం,దామెరకుంట గ్రామాల్లోని చెరువుల్లో అక్రమంగా మట్టిని తోడుతూ అమ్ముకుంటున్నట్లుగా సమాచారం.


**- ఎస్కార్ట్ చేస్తూ... మేనేజ్ చేస్తూ..**

మట్టి దందా వ్యవహారాన్ని సజావుగా కొనసాగేలా కొందరు ట్రాక్టర్ల ఓనర్లు ఎస్కార్ట్ తో పాటు సెంట్రీ విధులు చేస్తుంటారు. ట్రాక్టర్లలో మట్టిని నింపుకునే నుండీ పాయింట్ వద్ద అన్లోడ్ అయ్యేవరకు వారు ఎస్కార్ట్ చేస్తుంటారట.మరికొందరు కాటారం మెయిన్ సెంటర్లో ఉంటూ వచ్చిపోయే వాళ్ళని చూస్తూ గమనించడం వారి విధిగా నిర్వస్తారట.పొరపాటున ఎవరైనా వస్తే వారిని అక్కడికక్కడే మేనేజ్ చేసి అక్కడి నుండి పంపిస్తారట. ఈ క్రమంలోనే ఇటీవల మహాదేవపూర్ వైపు కి వెళ్లే చెరువులో అర్థరాత్రి మట్టి తీస్తుండగా సంబంధిత శాఖకు చెందిన కొందరు సిబ్బంది వెళ్లగా మ్యానేజ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.అంతేకాకుండా ఎప్పుడూ జరిగిన వారికి ఓ రేటును కట్టిస్తామనే సదరు మట్టి మాఫియా వ్యక్తులు ఆ సిబ్బందితో ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా ఇన్ఫర్మేషన్.ఇంతలా కాటారం సబ్ డివిజన్ నడిబొడ్డున చెరువుల్లో మట్టి మాఫియా తతంగం నడుస్తుండగా సంబంధిత అధికార యంత్రాంగం మిన్నకుంటున్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



# 'జూబ్లీహిల్స్'లో గెలుపెవరిది?

## అసెంబ్లీ స్థానానికి త్వరలో ఉప ఎన్నిక




- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, మజ్లీస్ మధ్య పోరు
- ఇప్పటికే నియోజకవర్గంలో సర్వే చేయించిన కాంగ్రెస్
- ముగ్గురి పేర్లను అధిష్ఠానానికి పంపించనున్న పార్టీ పెద్దలు
- సీటును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న పార్టీలు


అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఆ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక తప్పనిసరి అయింది. దీంతో రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రానికి సూచనలు పంపి, ఉప ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్ కోసం రంగం సిద్ధం చేస్తోంది. సెప్టెంబర్‌లో షెడ్యూల్ రాబోతోందని, అక్టోబర్‌లో పోలింగ్ ఉండొచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సుమారు 3.90 లక్షల ఓటర్లతో జూబ్లీహిల్స్ పెద్ద నియోజకవర్గంగా నిలుస్తున్నది. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ప్రారంభిస్తారని తెలుస్తోంది. దాదాపు 500 ఈవీఎంలు, 1,500 మంది సిబ్బంది అవసరం ఉండటంతో ఏర్పాట్లన్నీ ఇప్పటికే ముమ్మరం చేశారు. భద్రత కోసం కేంద్ర బలగాలు కూడా రంగంలోకి దిగనున్నాయి. ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. జూబ్లీహిల్స్ స్థానాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తున్నది. అలాగే స్థానికంగా మజ్లిస్ పార్టీ ప్రభావం కూడా ఉంది. సిట్టింగ్ సీటును మళ్లీ ఎన్నికల్లో గెలిపించుకునేందుకు బీఆర్ఎస్ కూడా పావులు కదుపుతున్నది. మజ్లిస్ పార్టీ ఒక బలమైన అభ్యర్థిని ప్రకటిస్తే, ముస్లిం ఓట్లు వేరు కావచ్చు.

**- ప్రధాన పార్టీల వ్యూహాలు**

సిట్టింగ్ సీటును ఎలాగైనా కాపాడుకోవాలని గులాబీ అధిష్ఠానం ముందే టార్గెట్ ఫిక్స్ చేసుకున్నది. నియోజకవర్గంలో ఉన్న లక్షా 25 వేలమంది ముస్లిం ఓటర్లు గెలుపు ఓటమిలో కీలక పాత్ర పోషిస్తారని గ్రహించి, స్థానిక మైనారిటీ నాయకులతో ఇప్పటికే ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసింది. పాతబస్తీతో సంబంధాలు ఉన్న నేతలను నియోజకవర్గంలోకి తీసుకువెళ్ళే ప్రయత్నాలు కూడా మొదలయ్యాయి. అధికార పార్టీ కాంగ్రెస్ కూడా జూబ్లీహిల్స్ సీటును దక్కించుకునేందుకు ప్రయత్నాలు షురూ చేసింది. ఇప్పటికే ఎంఐఎం పార్టీతో ఆ పార్టీకి సత్సంబంధాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతుంది. ఒకవేళ కాంగ్రెస్‌ని కాదని, ఎంఐఎం తన అభ్యర్థిని బరిలోకి దింపితే ఓట్లు చీలే అవకాశం ఉంది. తద్వారా కాంగ్రెస్‌కు నష్టం జరగవచ్చు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మూడోవంతు ఓట్లు ముస్లిం మైనారిటీలే. ఎంఐఎం పోటీ చేయడం వల్ల మైనారిటీ ఓట్లు చీలిపోతే లబ్ధి కాంగ్రెస్‌కి చేకూరుతుందా, లేక బీఆర్ఎస్‌కే కలిసి వస్తుందా అన్నది చూడాలి. ఇక భాజపా కూడా ఈ ఉపఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఏదేమైనా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను పార్టీలన్నీ సవాల్‌గా తీసుకుంటున్నాయి. నోటిఫికేషన్ రాకముందే ఈ నియోజకవర్గంలో ఎలా పాగా వేయాలన్న ప్లానింగ్‌లో ఆయా పార్టీల నేతలు మునిగి తేలుతున్నారు.

**- ఫలక్ లేదా మరొకరు..**

పాతబస్తీని అధిష్టానంగా పెట్టుకున్న మజ్లిస్ పార్టీ జూబ్లీహిల్స్ మీద దృష్టి సారించింది. 2014లో బలమైన పోటీ ఇచ్చిన తర్వాత 2018లో బీఆర్ఎస్ స్నేహానికి భజరంగీగా వ్యవహరించిన మజ్లిస్.. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం స్నేహపూర్వక పోటీ చేసి బీఆర్ఎస్‌కు లాభం చేకూర్చింది. ఈసారి మాత్రం కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో రాజకీయ సమీకరణలు కొత్తగా మారాయి. మూడో వంతు ముస్లిం ఓట్లు ఉన్న ఈ నియోజకవర్గంలో బలమైన అభ్యర్థిని నిలబెట్టడానికి మజ్లిస్ వ్యూహాత్మకంగా కసరత్తు చేస్తోంది. మజ్లిస్ పార్టీ నుంచి కరాటే చాంపియన్ సయ్యదా ఫలక్ పేరు పరిశీలనలో ఉందని సమాచారం. అదే సమయంలో పార్టీ అధిష్ఠానం పలు డివిజన్ల కార్పొరేటర్లను సంప్రదిస్తూ, ఎవరిని పార్టీ అభ్యర్థిగా ప్రకటించాలనే అంశంపై కసరత్తు చేస్తుందని వినికిడి. ముస్లిం మైనారిటీ ఓట్లు సమీకరించడానికి ఇది కీలకం కానుంది. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఈసారి జూబ్లీహిల్స్‌లో జెండా ఎగురవేయాలని మజ్లిస్ నేతలు ప్రణాళికలు వేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల పోటీ చేసిన షేక్‌పేట కార్పొరేటర్ మహ్మద్ రషీద్ పెద్దగా ఓట్లు రాబట్టుకోక పోవడంతో ఈసారి మరొకరిని పోటీకి దింపాలని యోచిస్తోంది. మజ్లిస్ పార్టీ పక్షాన మహిళా సాధికారత కోసం గళం విప్పుతున్న విద్యావంతురాలు, జాతీయ కరాటే చాంపియన్ సయ్యదా ఫలక్ పేరును కూడా పరిశీలిస్తోంది. గతంలో ఉమ్మడి పౌరసత్వానికి వ్యతిరేకంగా హైదరాబాద్తో పాటు దేవబంద్, ఢిల్లీ, షాహీన్బాగ్లలో జరిగిన నిరసన కార్యక్రమాలకు నాయకత్వం వహించి పార్టీ దృష్టిని ఆకర్షించారు. ఈ క్రమంలోనే మరో ఇద్దరు కార్పొరేటర్ల అభ్యర్థిత్వాలను సైతం పార్టీ పరిశీలిస్తున్నట్లు సమాచారం.



**ఎప్పుడు ఎవరు గెలిచారంటే..**

2009లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత, ఆ సంవత్సరం కాంగ్రెస్ అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో టీడీపీ అభ్యర్థి మాగంటి గోపినాథ్ ఎన్నికల్లో గెలిచారు. తర్వాత ఆయన బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డి కంటే.. ఎంఐఎం నుంచి పోటీ చేసిన నవీన్‌యాదవ్‌కు ఎక్కువ ఓట్లు వచ్చాయి. బీసీ సామాజిక వర్గానికి చెందిన నవీన్ యాదవ్ 9 వేల పైచిలుకు ఓట్ల తేడాతో రెండో స్థానంలో నిలిచారు. 2018లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేయకుండా అప్పటి మిత్రపక్షమైన అధికార బీఆర్ఎస్.. మాగంటి గోపినాథ్‌కు మద్దతు ప్రకటించింది. నవీన్ యాదవ్ మజ్లిస్‌కు రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి సుమారు 18 వేల పైచిలుకు ఓట్లు సాధించారు. 2023లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మజ్లిస్ మద్దతు ఇచ్చింది.

**రంగం సిద్ధం చేసుకుంటున్న బీజేపీ**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీజేపీ కూడా రంగం సిద్ధం చేసుకుంటున్‌ది. పార్టీ అధిష్ఠానం అభ్యర్థిని ఎంపిక చేసే పనిలో ఉంది. బీజేపీ నుంచి ఇక్కడ పోటీలో ఎవరు ఉండబోతున్నారనే అంశంపై ఉత్కంఠ నెలకొన్నది. ప్రస్తుతం ఇక్కడి నుంచి పోటీ చేసే బీజేపీ అభ్యర్థిగా హైదరాబాద్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ బీజేపీ అధ్యక్షుడు, గత ఎన్నికల్లో పోటీ చేసిన లంకాల దీపక్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కూతురు బండారు విజయలక్ష్మి, కే మాధవీలత, కీర్తి రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. అయితే బీజేపీ తమ పార్టీ అభ్యర్థిగా ఇక్కడి నుంచి ఎవరిని బరిలోకి దింపనుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

**అజారుద్దిన్, మరికొందరు పోటీ..**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో 16 వేల ఓట్ల తేడాతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజారుద్దీన్ ఓటమిపాలయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఆ సీటును దక్కించుకునేందుకు అజారుద్దీన్ తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే ఈ రేసులో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, విజయారెడ్డి, నవీన్ యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఇతర నేతలు అంజన్‌కుమార్ యాదవ్, సునీత రావు, బండి రమేష్, మైనంపల్లి హనుమంత రావు ఉన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం నెలాఖరుకల్లా అభ్యర్థిని ప్రకటించే అవకాశం కనిపిస్తున్నది. మరోవైపు పార్టీ పెద్దలు ఇప్పటికే ఆ అసెంబ్లీ నియోజకవర్గంలో సర్వే కూడా నిర్వహించారని తెలిసింది. సర్వే ఆధారంగా మొత్తం మూడు పేర్లను అధిష్ఠానానికి పంపనున్నారు. అధిష్ఠానం ఆ మూడింటిలో ఒకరి పరిశీలించి ఒక పేరు ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

# ఐదుగురు మావోల లొంగుబాటు

### జిల్లా ఎస్పీ శబరీష్ వెల్లడి



అక్షరదర్బార్, ములుగు: ములుగు జిల్లా ఎస్పీ డా.శబరిష్ సమక్షంలో సోమవారం ఐదుగురు మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. లొంగిపోయిన ఐదుగురు మావోయిస్టుల్లో ఒకరు ఏసీఎం కాగా మిగతా నలుగురు పార్టీ సభ్యులని జిల్లా ఎస్పీ డా.శబరీష్ వెల్లడించారు. ఆయన ములుగు జిల్లా కేంద్రంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. 'పోరుకున్న ఊరు మిన్న- మన ఊరికి తిరిగి రండి' అనే అవగాహన కార్యక్రమం ములుగు జిల్లాలో ఫలితాన్ని ఇస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న పునరావాస సదుపాయాలను తెలుసుకుని నక్సలిజాన్ని వదిలి ప్రశాంతమైన జీవితం గడపాలనే ఉద్దేశంతో నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఐదుగురు లొంగిపోయినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన వారిలో శ్యామల రాజేష్, కడ్తిల్ దుమా, ఊకే జోగి, బాడిశె బీమా, ముచ్చకి జోగి ఉన్నారని, ఈ ఐదుగురు ఛత్తీస్ గడ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాలకు చెందిన వారని డాక్టర్ శబరీష్ ప్రకటించారు. మావోయిస్టు పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలిసిన ఈ ఐదుగురికి తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున జిల్లా ఎస్పీ అందజేశారు. తదుపరి హోదాల ఆధారంగా మిగిలిన మొత్తం రూ.6.75 లక్షలు వారి ఖాతాల్లో చెక్కుల రూపంలో జమ చేయనున్నట్లు తెలిపారు. మావోయిస్టు పార్టీ రోజురోజుకు క్షీణిస్తున్న పరిస్థితిని చూస్తూ కింది స్థాయి కేడర్ పై స్థాయి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ రహస్య ఉద్యమాన్ని, ఉద్యమ జీవితాన్ని వదిలి తాము కూడా కుటుంబాల వెంట జీవితాన్ని గడపాలని భావిస్తున్నారని జిల్లా ఎస్పీ చెప్పారు. ఇదే కారణంతో ఇప్పటివరకు గత జనవరి నుంచి జిల్లాలో 73 మంది సాయుధ మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారని ఆయన తెలిపారు. లొంగిపోయిన 73 మంది సాయుధ సభ్యులకు నగదు రివార్డులు, తక్షణ సహాయం, పునరావాస సదుపాయాలు అందించబడ్డాయని అన్నారు. మావోయిస్టులకు సహకరిస్తే ప్రాంతాలు అభివృద్ధి చెందవని, కేవలం ప్రజాస్వామ్య ప్రభుత్వాల ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# ఆకలి తీర్చే ఆయుధం రేషన్ కార్డు

- పేదలు కడుపు నిండా తినాలనే సన్నబియ్యం పంపిణీ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణీ షురూ



అక్షరదర్బార్, తిర్మలగిరి : రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక అని, అది ఆకలి తీర్చే ఆయుధమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నల్గొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో ఆదివారం నిర్వహించిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. నల్గొండ చరిత్రే తెలంగాణ చరిత్ర అని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నా పేదల కోసం రేషన్ కార్డులు, సన్న బియ్యం ఇచ్చే ఆలోచన కూడా చేయలేదని విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం 3.10 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తుండటంతో రేషన్ దుకాణాల వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు బారులు తీరుతున్నారని వివరించారు. వ్యవసాయం దండగ కాదని, పండగ కావాలని రైతులకు గిట్టుబాటు ధరతోపాటు బోనస్ అందించామన్నారు. దేశం తలెత్తుకునేలా తెలంగాణ వరి ఉత్పత్తి చేస్తుందన్నారు. గతంలో ప్రతిపక్ష నేతలు మూడు రోజుల్లో తుంగతుర్తికి గోదావరి జలాలు తెస్తామన్నారు కానీ పదేళ్లు అవకాశం ఇచ్చినా దేవాదుల నుంచి నీళ్లు తేలలేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు సీఎం అయ్యాక గోదావరి జలాలు తెస్తే అడ్డుకుంటామంటున్నారని విమర్శించారు.

# రైతుకు అన్ని విధాలా అండగా ఉంటాం


- ఆర్థిక సమస్యలున్నప్పటికీ సాయం చేస్తూనే ఉంటాం..
- సాగుకు ఇబ్బంది లేకుండా సాగు జలాలు: మంత్రి పొంగులేటి
- ఖమ్మం జిల్లాలోని పాలేరు నుంచి సాగర్ జలాలు విడుదల
- బీఆర్ ఎస్ హయాంలో రైతులకు అన్యాయం: డిప్యూటీ సీఎం భట్టి



అక్షరదర్బార్, ఖమ్మం : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టాల్లో ఉన్నా రైతు పథకాల అమలు కోసం ఏకాగ్రతగా పనిచేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా పాలేరు జలాశయం నుంచి సాగర్ ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేసిన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి పాల్గొన్నారు. ''సాగర్ ఆయకట్టు కింద 2.5 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నాం. ఇప్పటికే 400 క్యూసెక్కుల నీరు విడుదల చేశాం. రాబోయే ఐదు రోజుల్లో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరు చేరుస్తాం. కృష్ణా బేసిన్‌లో ఎక్కడా పంటలకు నీటి కొరత ఉండకుండా చర్యలు తీసుకుంటున్నాం'' అని మంత్రి వివరించారు. రైతు భరోసా పథకానికి పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. ''రైతులకు ఎకరాకు రూ.12 వేలు ఇచ్చాం. కేవలం 9 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు జమ అయ్యాయి. సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తున్నాం. మిగిలిన పంటలకు కూడా ఇలాగే బోనస్ ఇస్తాం'' అని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ''కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యవసాయం, కరెంటు, ప్రాజెక్టులే ప్రాణం. గతంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేకపోయారు. ఆనాడు చేసిన తప్పులనే ఇప్పుడు దుష్ప్రచారంతో కప్పిపుచ్చాలనుకుంటున్నారు. ప్రజలు మోసపోరు'' అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# ఆర్మీ జవాన్ అదృశ్యం

- మూడు రోజులుగా గాలింపు చర్యలు - దొరకని ఆచూకీ



అక్షరదర్బార్, మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం గ్రామపంచాయతీ పరిధిలోని పూసలతండాకు చెందిన ఆర్మీ జవాన్ మూడు నవీన్ 2021 సంవత్సరంలో ఇండియన్ ఆర్మీలో చేరి దేశ రాజధాని ఢిల్లీలో విధులు నిర్వహిస్తున్నాడు. 2023లో దంతాలపల్లికి చెందిన సరితను వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు సంతానం. నవీన్ ఇటీవల తన భార్య సరితకు శస్త్ర చికిత్స నిమిత్తం తన సొంత కారులో హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో గాల్బ్లాడర్ ఆపరేషన్ చేయించాడు. సరిత ఆసుపత్రిలో ఉండగానే ఏం జరిగిందో ఏమో కానీ భార్య సరితకు చెప్పాపెట్టకుండానే ఆసుపత్రి నుంచి వెళ్లిపోయాడు. ఆసుపత్రిలో ఉన్న భార్య బంధువులతో పూసలతండాకు చేరుకుంది. కానీ భర్త ఇంట్లో లేకపోవడంతో కన్నీరు మున్నీరుగా విలపించింది. బంధువులంతా ఆరా తీయగా తాను ప్రయాణించిన కారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీశైలం డ్యాం వద్ద ఉందని విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శ్రీశైలం చేరుకుని నవీన్ కోసం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి అక్కడి పోలీసులతో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ దొరకలేదు. ఎంతో కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశ రక్షణలో పాటుపడుతున్న ఆర్మీ జవాన్ కనిపించకపోవడంతో ఆ పూసల తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## షెడ్యూల్డ్ ప్రాంతాల సమస్యలు పరిష్కరించాలి

### ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్



అక్షర దర్బార్ , వెంకటాపురం (నూగూరు): ములుగు జిల్లా కేంద్రంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి, షెడ్యూల్డ్ ప్రాంతాల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 244, ఐదవ షెడ్యూల్ ప్రకారం ఆదివాసీల హక్కులను కాపాడాలని ఈ సందర్భంగా పరిషత్ జిల్లా కన్వీనర్ పర్షిక సతీష్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఆదివాసుల జీవన విధానాన్ని దెబ్బతీస్తూ, చట్టాలను నిర్వీర్యం చేస్తోందని సతీష్ ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులకు హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటాపురం మండలంలోని ముత్తారం, శాంతి నగర్, కలిపాక, కల్వర్టు, రోడ్డు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. షెడ్యూల్డ్ ప్రాంతాల చట్టాలు, హక్కులు, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.

# అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన కలెక్టర్, జిల్లా అధికారులు



అక్షరదర్బార్, హనుమకొండ: ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కు విన్నవించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాకు చెందిన ప్రజలు 206 అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను పరిష్కరించడంలో అధికారులు ఆలస్యం చేయొద్దన్నారు. ప్రజావాణి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, డీఆర్డీవో మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కే నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్య

### మృతుల్లో ఒకరు వైద్యురాలు

అక్షరదర్బార్, వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఒకేరోజు వేరు వేరు చోట్ల నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. మృతుల్లో ఒక వైద్యురాలు ఉన్నారు. వరంగల్ ఏనుమాములలో స్వామి, గాయత్రి దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆదివారం రాత్రి పురుగులమందు తాగిన దంపతులు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందారు. స్వామి, గాయత్రి ఇటీవల రెండో వివాహం చేసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే కుటుంబ కలహాలతో హసన్ పర్తికి చెందిన వైద్యురాలు ప్రత్యూష ఆత్మహత్య చేసుకున్నారు. ప్రత్యూష భర్త సృజన్ కూడా డాక్టర్. ఈయనకు ఒక యువతితో పరిచయం ఏర్పడటం, అది ప్రేమగా మారడంతో సృజన్, ప్రత్యూష దంపతుల మధ్య గొడవలకు దారి తీసినట్లు తెలిసింది. భర్త సృజన్ వైఖరితో మనస్థాపం చెందిన డాక్టర్ ప్రత్యూష ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. మృతురాలు ప్రత్యూష తండ్రి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ గా పని చేస్తున్నట్లు తెలిసింది. ఇక ఆస్తి తగాదాలతో ఖిలావరంగల్ ప్రాంతంలో సంతోష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

## సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

### జాడి ఈశ్వర్ నేతకాని

వెంకటాపురం(నూగూరు): వర్షాకాలం దృష్ట్యా టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని తెలంగాణ నేతకాని సంక్షేమ వ్యవస్థాపకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి ఈశ్వర్ నేతకాని డిమాండ్ చేశారు. గ్రామాల్లో పారిశుధ్య లోపాలను వెంటనే పరిష్కరించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లి, దోమల మందు పిచికారి చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులు, మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, లేనిపక్షంలో పేద ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## యూరియా కొరతను నివారించాలి

### న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ ధర్నా

అక్షర దర్బార్, వరంగల్: జిల్లాలో రైతులకు సరిపడా యూరియాను అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మరియు అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాయకులు సోమవారం వరంగల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్ సీజన్ మొదలైనా, యూరియా కొరత తీవ్రంగా ఉందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు యూరియా కోసం సొసైటీల వద్ద పడిగాపులు కాస్తున్నా, సరిపడా స్టాకు అందుబాటులో లేదని తెలిపారు. ప్రైవేటు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ దందా చేస్తున్నారని, అలాగే అధికార పార్టీ నాయకులు తమకు అనుకూలమైన వారికే యూరియా ఇప్పించి రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

# అక్రమ ఫైనాన్స్‌పై కఠిన చర్యలు

## ఎస్పీ కిరణ్ ఖరే

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: అనధికార చిట్ ఫండ్, అక్రమ ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే హెచ్చరించారు. బాధితులు 87126 58108 కు ఫోన్ ద్వారా తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు.



# జోగంపల్లి ప్రాజెక్టు నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే జీఎస్సార్

అక్షర దర్బార్, శాయంపేట: భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం జోగంపల్లి చలివాగు ప్రాజెక్టు చెరువు నీటిని దిగువన ఉన్న పంట పొలాలకు విడుదల చేశారు. రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు.





# డబ్బులేక ప్రాణాలు కోల్పోయాడు

## యువకుడి మృతిపై గ్రామస్తుల ఆవేదన



అక్షర దర్బార్ , చిట్యాల : సరైన వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేక, చిట్యాల మండలానికి చెందిన కనకం తిరుపతి (35) అనే యువకుడు సోమవారం గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందాడు. బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త అయిన తిరుపతికి గత సంవత్సరం గుండెపోటు రావడంతో అప్పులు చేసి ఓపెన్ సర్జరీ చేయించుకున్నాడు. అయితే, ఆర్థిక ఇబ్బందులు, పనులు లేకపోవడంతో గత 7-8 నెలలుగా సరైన వైద్యం, మందులు తీసుకోలేకపోయాడు. దీంతో గుండె సమస్యలు తిరగబెట్టాయి. పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. ఓపెన్ సర్జరీ తర్వాత సరైన టెస్టులు చేయించుకుంటూ, మందులు వాడి ఉంటే తిరుపతి బతికేవాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. "పైసలు లేకనే తిరుపతి ప్రాణాలు పోయినాయ్" అంటూ పలువురు కన్నీరుమున్నీరయ్యారు.



# కేసముద్రం బస్టాండ్‌కు మోక్షమెప్పుడు ?

అక్షర దర్బార్, కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో దశాబ్దాలుగా బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీగా మారిన తర్వాత పలు అభివృద్ధి పనులు జరిగినా, బస్టాండ్‌పై మాత్రం మెతక వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి తన హామీని నిలబెట్టుకొని, బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు, రాజకీయ పక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.




# జూబ్లీ నగర్‌కు బస్సు సేవలు ప్రారంభం

అక్షర దర్బార్, రేగొండ: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం రేగొండ మండలం జూబ్లీ నగర్ గ్రామానికి బస్సు సర్వీసును ప్రారంభించారు. పరకాల నుండి ములుగుకు జూబ్లీ నగర్ మీదుగా ఈ బస్సు నడుస్తుంది. గ్రామీణ రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు.

# దివ్యాంగుల మండల అధ్యక్షుడు మృతి

అక్షర దర్బార్, చిట్యాల, జూలై 14: చిట్యాల మండలం (NPRD INDIA) దివ్యాంగుల అధ్యక్షుడు గుట్ట ప్రభాకర్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన ప్రభాకర్ మృతి పట్ల పలువురు దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఖరీఫ్‌కు యూరియా కొరత

## రైతన్నల ఆందోళన

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: వానాకాలం (ఖరీఫ్) సీజన్‌కు యూరియా, ఇతర ఎరువుల కొరత రాష్ట్రంలో తీవ్రంగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం నుంచి కోటా మేరకు సరఫరా లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. మొగుళ్లపల్లి మండలంలో రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారని, పంపిణీలో జాప్యం జరుగుతోందని తెలిపారు.



### తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై ఫిర్యాదు

అక్షర దర్బార్, పరకాల: కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ పరకాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆడబిడ్డలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని, ప్రభుత్వం, మహిళా కమిషన్ తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: మహిళలు ఆర్థికంగా స్థిరపడాలని, స్వశక్తి సంఘాలు ఉపాధి అవకాశాలను పెంచుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంథని నియోజకవర్గంలో జరిగిన ఇందిరా మహిళా శక్తి సంబురాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ విద్యుత్ కేంద్రాలు, ఆర్టీసీ




బస్సులను అందిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, బ్యాంక్ లింకేజీ, బీమా పథకాలు వంటి ఆర్థిక సాయాన్ని అందజేశారు. కుట్టు మిషన్లలో శిక్షణ, అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ రాహుల్ శర్మ, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉచితంగా కంటి ఆపరేషన్లు

అక్షర దర్బార్, చిట్యాల : కంటి పొరల సమస్యలతో బాధపడే వృద్ధులకు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ ఆయిలి మారుతి ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నారు. ఈ నెల 17న భూపాలపల్లి నుండి బస్సులో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించి ఆపరేషన్లు చేయిస్తారని తెలిపారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలం వెంకట్రావ్‌పల్లికి చెందిన కనకం తిరుపతి, నైన్‌పాక, దూత్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం మొగుళ్లపల్లి పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

# ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

అక్షర దర్బార్, రేగొండ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తిరుమలగిరి గ్రామానికి చెందిన కందికొండ రాజమౌళి కుటుంబానికి సేవక్ గ్రూప్ సభ్యులు సోమవారం రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు.

# సీజ్ చేసిన ఇసుకకు వేలం పాట

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలం కాల్వపల్లిలో సీజ్ చేసిన 880 క్యూబిక్ మీటర్ల ఇసుక డంపులకు రేపు సాయంత్రం 4 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఎమ్మార్వో ఇమామ్ బాబా తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల పేరుతో కాంగ్రెస్ దోపిడీ: పెద్ది సుదర్శన్ రెడ్డి

అక్షర దర్బార్, నర్సంపేట: ఇందిరమ్మ ఇండ్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ నాయకులు వసూళ్ల దోపిడీకి పాల్పడుతున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కొరత, మట్టి దందా వంటి అంశాలపై ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.



# కేంద్ర ప్రభుత్వంతోనే జీపీలకు అధిక నిధులు

అక్షర దర్బార్, నర్సంపేట: తెలంగాణలోని గ్రామపంచాయతీలకు అధిక నిధులు మంజూరు చేస్తున్నది కేంద్ర ప్రభుత్వమేనని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం చెన్నారావుపేట మండలం పాపయ్యపేటలో పలువురు బీజేపీలో చేరగా ఆయన మాట్లాడారు.

# లోకల్ కోర్టును వినియోగించుకోండి

అక్షర దర్బార్, మల్హర్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న సర్వాయిపేట సబ్‌స్టేషన్‌లో లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు కాటారం ఏడీఈ నాగరాజు తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ, వోల్టేజీ సమస్యలు తదితరాలపై ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# మెపా రాష్ట్ర కార్యదర్శికి ముదిరాజ్ మహాసభ పరామర్శ

అక్షర దర్బార్, దుగ్గొండి: మెపా రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి తల్లి మృతి చెందగా, సోమవారం దుగ్గొండి ముదిరాజ్ మహాసభ సభ్యులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

# మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రానికి చెందిన కనకం తిరుపతి మరణించగా, తోటి మిత్రులు వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.23,000 ఆర్థిక సాయం అందజేశారు. తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.